క్లుప్తంగా

మహిళలు ఇంకా రాణించాలి



ఎంపీడీఓను సన్మానిస్తున్న ఐకేపీ సిబ్బంది

ఉదయగిరి: మహిళలు ప్రస్తుతం అనేక రంగాల్లో రాణిస్తూ మంచి గుర్తింపు పొందుతున్నారని, భవిష్యత్‌లో ఇంకా రాణించాల్సిన అవసరం ఉందని ఎంపీడీఓ బండారు ఈశ్వరమ్మ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దాదాపుగా అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు రక్షణ రంగంలో కూడా కీలక పాత్ర పోషిస్తుండడం సంతోషకరమన్నారు. ప్రతి మహిళ ఇతరులపై ఆధారపడకుండా సొంతంగా జీవించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం స్థానిక ఐకేపీ సిబ్బంది పలువురు మహిళలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏపీఎం ఖాజారంతుల్లా, ఇరిగేషన్ ఏఈ వేణు తదితరులు పాల్గొన్నారు.

మాక్ ఓటింగ్ పరిశీలన



మాక్ పోలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

ఉదయగిరి: త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో గురువారం స్థానిక స్త్రీశక్తి భవన కార్యాలయం ప్రాంగణంలో మాక్ పోలింగ్ ప్రక్రియను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఓటర్లు ఈవీఎం ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తాము వేసిన గుర్తుకు ఓటు నమోదైందా.. లేదా అని పరిశీలించుకున్నారు. తాము వేసిన గుర్తులకే ఓటు నమోదైనట్లు నిర్ధారించుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నెహ్రూబాబు, పోలింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ



అల్లూరు: ప్రతి ఒక్కరూ ఓటు హక్కుపై అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ దుర్గేశ్వరరావు తెలిపారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తూ గురువారం స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాల వద్ద నుంచి పాత బస్టాండ్ సెంటర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎం ప్రసాద్‌రావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి, పలువురు అధికారులు, విద్యార్థులు, నూతన ఓటర్లు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన



జాబ్‌మేళాకు విచ్చేసిన నిరుద్యోగ యువత

ఆత్మకూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ), కందుకూరు పాలిటెక్నిక్ కళాశాలలు సంయుక్తంగా నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా మేనేజర్ సి.విజయ్ వినీల్‌కుమార్ నేతృత్వంలో గురువారం ఆత్మకూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పలు కంపెనీలు జాబ్‌మేళా నిర్వహించాయి. ఈ జాబ్‌మేళాలో 23 మందికి ఉద్యోగాలు లభించినట్లు కళాశాల ప్రిన్సిపల్ నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఓడీ వెంకటరమణారెడ్డి, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ.231

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గురువారం కిలో పొగాకు గరిష్ట ధర రూ.170 లభించింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 27 పొగాకు బేళ్లను విక్రయానికి తీసుకురాగా కొనుగోలు చేశారు. వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ మాట్లాడుతూ కిలో పొగాకుకు గరిష్ట ధర రూ.231, కనిష్ట ధర రూ.230 పలకగా, సరాసరి కిలో పొగాకుకు రూ.230 లభించిందని తెలిపారు. వేలంలో 10 కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

చేజర్ల: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని మండల కోఆర్డినేటర్ ప్రసాద్ సూచించారు. ఈ మేరకు గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణ అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఒక్కో లబ్ధిదారుడికి ఎంతమేర ప్రయోజనం చేకూరిందో వివరించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్‌కే కరిముల్లా, ఈఓపీఆర్డీ రామయ్య, వలంటీర్లు పాల్గొన్నారు.

కావలిని కనకపట్నం చేసుకుందాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, వేదికపై ఎంపీలు విజయసాయిరెడ్డి, బీద మస్తాన్‌రావు

- కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: కావలిని కనకపట్నం చేసుకునేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని స్థానిక ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక ఆర్ఎస్సార్ కల్యాణ మండపంలో గురువారం రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి సమక్షంలో జరిగిన వైఎస్సార్‌సీపీ కావలి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ మరోసారి విజయం అధికారం చేపట్టేలా రానున్న ఎన్నికల్లో అందరం కలిసి కష్టపడి పనిచేద్దామని పిలుపునిచ్చారు. గత ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తల కృషి వల్లే కావలిలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేసి జగనన్నకు కానుకగా ఇచ్చామని గుర్తుచేశారు. రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి సహకారంతో రాబోయే రోజుల్లో కావలిని మరింతగా అభివృద్ధి చేసుకునేందుకు చక్కటి అవకాశం ఏర్పడుతోందన్నారు. రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్, దామవరం విమానాశ్రయంతోపాటు చెన్నై–విజయవాడ రైల్వే మార్గం, చెన్నై–కలకత్తా జాతీయ రహదారి ద్వారా కావలి శరవేగంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు.

అత్యధిక మెజార్టీ కావలిలోనే..

వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, కందుకూరు నియోజకవర్గ పరిశీలకుడు మన్నెమాల సుకుమార్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో జిల్లాలో అత్యధిక మెజార్టీ రికార్డు కావలిలోనే సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా విజయసాయిరెడ్డి పోటీ చేయడం జిల్లా ప్రజల అదృష్టమన్నారు. అలాగే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని కూడా కావలి ప్రజలు హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా భావిస్తున్నారని తెలిపారు. 2024 ఎన్నికల్లో ఎంపీగా విజయసాయిరెడ్డి, ఎమ్మెల్యేగా రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి రికార్డు స్థాయి మెజార్టీలతో విజయం సాధిస్తారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి, కసమర్లపూడి వెంకటనారాయణ, పందిటి కామరాజు, సన్నిబోయిన ప్రసాద్‌యాదవ్, జంపాని రాఘవులు, మద్దిబోయిన వీరరఘుయాదవ్, తాళ్లూరు ప్రసాద్‌నాయుడు, నీలం సాయికుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరికలు





వైఎస్సార్‌సీపీలో చేరుతున్న అన్నపూర్ణ శీను, వాసంతి, వెంకట్రావు

కావలి: బాలకృష్ణ ఫ్యాన్స్ కావలి డివిజన్ నాయకుడు బొగ్గవరపు శ్రీనివాసరావు అలియాస్ అన్నపూర్ణ శీను గురువారం కావలిలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్‌సీపీలో చేరిన ఆయనకు రాజ్యసభ సభ్యుడు వేణుంబాక విజయసాయిరెడ్డి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ శీను మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ విజయం కోసం ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి నాయకత్వంలో పనిచేస్తామని తెలిపారు. అలాగే కావలి పట్టణ తెలుగు మహిళ అధ్యక్షురాలు ద్రోణాదుల వాసంతి, బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ద్రోణాదుల వెంకట్రావు దంపతులు గురువారం టీడీపీకి గుడ్ బై చెప్పి వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి రాజ్యసభ సభ్యుడు వేణుంబాక విజయసాయిరెడ్డి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.

సంక్షేమ పాలనతోనే పార్టీలోకి చేరికలు

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన మహిళలు, యువకులు

ఆత్మకూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనను చూసి టీడీపీకి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో 12వ వార్డు దళితకాలనీకి చెందిన పలువురు టీడీపీ మహిళలు, యువకులు గురువారం ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై అపారమైన నమ్మకంతో పార్టీలో చేరినట్లు 12వ వార్డు టీడీపీ మహిళా అధ్యక్షురాలు పేమల వెంకటసుబ్బమ్మ తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం కోసం కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, తోడేటి మణి, కొండా వెంకటేశ్వర్లు, దిలీప్, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి పథంలో ముందుకుసాగుతున్నాం



మాట్లాడుతున్న ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ

సోమశిల: అనంతసాగరం మండలాన్ని అన్ని రంగాల్లో ప్రగతి పథంలో నడిపించేలా ముందుకుసాగుతున్నామని ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ పేర్కొన్నారు. మండల కేంద్రం అనంతసాగరంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో ఏర్పాటైన సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా ప్రజలకు అన్ని ప్రభుత్వం సేవలు అందుతున్నాయని తెలిపారు. రైతుభరోసా కేంద్రాలు అన్నదాతలకు అండగా నిలుస్తున్నాయని తెలిపారు. ప్రజలు వివిధ పనుల కోసం మండల కేంద్రాలకు వెళ్లనవసరం లేకుండా సొంత ఊర్లోనే పరిష్కరించుకునేలా ప్రభుత్వ సేవలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. పలు శాఖల అధికారులు మాట్లాడుతూ గత నాలుగున్నరేళ్లలో మండలంలో జరిగిన అన్ని అభివృద్ధి పనులను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తాజ్‌మస్రూర్, శాప్ డైరెక్టర్ కాలువ నరసింహులు, మండల ఉపాధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, పాజెం శ్రీనివాసులు, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బూత్ కమిటీ సభ్యులే కీలకం

ఉదయగిరి: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గెలుపులో కీలక పాత్ర బూత్ కమిటీ సభ్యులదేనని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఉదయగిరి, సీతారామపురం మండలాలకు సంబంధించి గురువారం ఆయా మండల కేంద్రాల్లో బూత్ కమిటీ సభ్యుల శిక్షణ కార్యక్రమం జరిగింది. ఆయా కార్యక్రమాల్లో రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ వచ్చే 45 రోజులు ఎంతో కీలకంగా పనిచేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి ఈ ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలకు జరిగిన మేలును వివరించాలన్నారు. జగనన్నకు మరో అవకాశం ఇస్తే మరిన్ని సంక్షేమ పథకాలతోపాటు అభివృద్ధి జరిగి రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు అభినవ్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు జి.ఓబులరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రామాంజనేయులు, జిల్లా కోఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్, ఉప సర్పంచ్ ముర్తుజా, నేతలు అక్కి భాస్కర్‌రెడ్డి, ఎస్దానీ, మూలే సుబ్బారెడ్డి, కె.కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ వేణుగోపాల్‌రెడ్డి

ఆత్మకూరురూరల్: ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ వేణుగోపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు పెమ్మసాని ప్రసన్నలక్ష్మి మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్యారోగ్య, వ్యవసాయ, పంచాయతీరాజ్, ఎన్ఆర్ఈజీఎస్, ఐసీడీఎస్, విద్యుత్, రహదారులు, భవనాలు తదితర ప్రభుత్వ విభాగాలకు సంబంధించిన పనుల పురోగతిపై సభలో చర్చించి తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు ఉద్దాల పెంచలరావు, ప్రమీల, ఎంపీడీఓ బాలాజీనాయక్, సిండికేట్ ఫార్మర్స్ సొసైటీ అధ్యక్షుడు సానా వేణుగోపాల్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల పరిశీలకుల నియామకం

నెల్లూరు(దర్గామిట్ట): వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉదయగిరి, కోవూరు, నెల్లూరురూరల్ అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికల పరిశీలకులను నియమించారు. ఉదయగిరికి మాజీ జెడ్పీచైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, కోవూరుకు ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి, నెల్లూరురూరల్‌కు మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డిని నియమించారు.

ఎమ్మెల్యే ఆర్థికసాయం



ఆత్మకూరురూరల్: మండలంలోని అప్పారావుపాళెం పడమర అరుంధతీయవాడకు చెందిన దన్యాసి ఆనంద్ ఇటీవల పక్షవాతంతో మంచానికి పరిమితమయ్యాడు. అప్పటికే ఆయన కుమార్తెకు వచ్చే పెన్షన్‌పై ఆ కుటుంబం ఆధారపడి జీవించేది. అయితే ఇటీవల ఆమె కూడా మృతిచెందిన నేపథ్యంలో జెడ్పీటీసీ సభ్యురాలు పెమ్మసాని ప్రసన్నలక్ష్మి ఆ కుటుంబ పరిస్థితిని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా గురువారం ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి తన సొంత నిధుల నుంచి రూ.30 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు పెమ్మసాని శ్రీనివాసులునాయుడు, అప్పారావుపాళెం సచివాలయం కన్వీనర్ చంద్రా హజరత్‌నాయుడు, పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

అనుమసముద్రంపేట: మండలంలోని చందలూరుపాడులో రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై ప్రసాద్‌రెడ్డి కథనం మేరకు.. చందులూరుపాడులో పరంధామయ్య అనే వ్యక్తి వద్ద రేషన్ బియ్యం నిల్వ ఉందని గుర్తించిన స్థానికులు విజిలెన్స్ అధికారులకు సమాచారం అందడంతో వారు గురువారం దాడులు నిర్వహించారు. ఈ 800 కిలోల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆపన్నులకు అండగా ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

సంగం: ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆపన్నులకు అండగా నిలుస్తున్నారు. సంగం మండలం తరుణవాయిలో గురువారం రాత్రి పర్యటించిన ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి ఇరు కుటుంబాలకు రూ.70 వేల ఆర్థికసాయం అందజేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. తల్లిదండ్రులను కోల్పోయి అమ్మమ్మ వద్ద ఉంటున్న సుజీత్ అనే బాలుడి గురించి స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే మేకపాటి అమ్మమ్మ ఉక్కాల రమణమ్మకు రూ.20 వేల ఆర్థికసాయం అందజేశారు. అలాగే ఇటీవల మృతిచెందిన అంగన్‌వాడీ కార్యకర్త ఇండ్ల రమణమ్మ కుటుంబ పరిస్థితిని నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, రమణమ్మ భర్త చేవూరు వేణుకు రూ.50 వేలు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, నాయకులు కంటాబత్తిన రఘునాథరెడ్డి, రావుల లక్ష్మీప్రసాద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

దుత్తలూరు: మండల రైతు ఉత్పత్తిదారులు సమాఖ్యలో పనిచేసేందుకు ముగ్గురు సిబ్బంది అవసరమని, ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని ఏపీఎం శ్రీనివాసులు గురువారం తెలిపారు. అకౌంటెంట్–1 (స్త్రీ), రైతుమిత్ర–2 పోస్టులకు ఈ నెల 11వ తేదీన స్థానిక వైకేపీ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అకౌంటెంట్ పోస్టుకు డిగ్రీ, రైతుమిత్ర పోస్టుకు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. తమ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని తెలిపారు.

ఎన్నికల విధులపై అవగాహన

సంగం: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బీఎల్‌ఓలకు ఎన్నికల విధులపై తహసీల్దార్ రమాదేవి అవగాహన కల్పించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం జరిగిన ఈ సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద చేపట్టాల్సిన విధులపై పలు సూచనలు చేశారు.

బైక్‌లు ఢీ.. వ్యక్తికి తీవ్రగాయాలు

సోమశిల: అనంతసాగరం మండలం పాతాళపల్లి వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. చాపురాళ్లపల్లి గ్రామానికి చెందిన కొండారెడ్డి అనంతసాగరం నుంచి తమ స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా మరో బైక్ కలువాయికి వెళుతూ పాతాళపల్లి వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కొండారెడ్డి కాలికి, తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్సనిమిత్తం 108 వాహనంలో ఆత్మకూరులోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి సమాచారం లేదు.

అత్యధిక మెజారిటీతో గెలిపిద్దాం



జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మతో కలసి అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి



బైక్ ర్యాలీలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

సంగం: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టేలా అత్యధిక మెజారిటీతో గెలిపిద్దామని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం సంగం మండలం చెన్నవరప్పాడు, ఉడ్‌హౌస్‌పేట, తరుణవాయి గ్రామాల్లో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి విజయీభవ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు తుంగా ఇందూధర్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, సర్పంచ్ శోభాబాలానాయుడు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం చెన్నవరప్పాడు గ్రామంలో రూ.18.80 లక్షలతో నిర్మించిన సీసీరోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలను, ఉడ్‌హౌస్‌పేట గ్రామంలో సర్పంచ్ ఆర్.శోభాబాలానాయుడు దాతృత్వంతో ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం నేతృత్వంతో రూ.4 లక్షలతో ఏర్పాటు చేసిన వీధిలైట్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే రూ.19.50 లక్షల జెడ్పీ నిధులతో తారురోడ్డు నిర్మాణ పనులను జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెవెన్యూ వ్యవస్థలో తీసుకొచ్చిన సంస్కరణలతో వందలాది మంది రైతుల సమస్యలు పరిష్కారమయ్యాయని తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి కుటుంబాన్ని, ప్రతి గ్రామాన్ని అభివృద్ధి వైపు నడిపించారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఆత్మకూరు ఎమ్మెల్యేగా మేకపాటి విక్రమ్‌రెడ్డిని, నెల్లూరు ఎంపీగా వి.విజయసాయిరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. అనంతరం తరుణవాయి గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయం, విలేజ్ హెల్త్‌క్లినిక్, రైతుభరోసా కేంద్రాలతోపాటు ఆర్‌ఓ ప్లాంట్‌లను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రావుల లక్ష్మీప్రసాద్‌గౌడ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు గంగపట్నం చంద్రశేఖరయ్య, దేవసహాయం, వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ కంటాబత్తిన రఘునాథరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు పెంచలమ్మ, కొండయ్య, మల్లి, ప్రకాష్, కోటారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, జహంగీర్, నరేష్, శంకరయ్య, కరిముల్లా, రవీంద్రబాబు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధిని చూసి ఓటేద్దాం

సంగం: సంగంలో రూ.1.35 కోట్లతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ కంటాబత్తిన రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, యువత భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. యువతను ఉత్సాహపరిచేందుకు ఎమ్మెల్యే మేకపాటి బైక్ ర్యాలీలో పాల్గొని వాహనాన్ని నడిపారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న పాలనలో ప్రజలందరూ ఆనందంగా ఉన్నారని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టేలా అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కరిముల్లా, జనార్దన్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సర్పంచ్ మానికల చందన్‌కుమార్, ఫణికుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



ఆత్మకూరు: పట్టణంలోని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం సభ్యులు అనంతరాయనియేని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులకు, అంగన్‌వాడీ చిన్నారులకు పుస్తకాలు, పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ శివకుమార్ ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులు పాఠశాల విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేశారు. ఎల్ఐసీ ఉద్యోగులు ప్రవీణ, రమాదేవి, సౌజన్య, రమేష్, శీనయ్య, ఉపాధ్యాయుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధన కోసం పోరాడుదాం



మాట్లాడుతున్న దాసరి సువర్ణరాజు

సోమశిల: మాదిగలు హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సువర్ణరాజు అన్నారు. గురువారం మండలంలోని మినగల్లు ఎస్టీకాలనీలో మాదిగల రాజకీయ సమన్వాయ సమావేశ వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగలను చైతన్యవంతులను చేసేలా సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

ఆత్మకూరు: మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారని, వారు మరింత అభివృద్ధి సాధించేలా అవకాశాలు కల్పించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆత్మకూరు పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గురువారం ముందస్తుగా నిర్వహించారు. తొలుత మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో న్యాయవాదులు మాట్లాడుతూ గతంలో మహిళలు అన్ని రంగాల్లోనూ తమ సత్తా చాటుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ సునీలత, సూపర్‌వైజర్లు, బార్ అసోసియేషన్ సభ్యులు ఎల్‌వీ రమణయ్య, ఎస్‌కే సిరాజుద్దీన్, ఎస్‌కే రసూల్, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పొదుపు మహిళలకు, సంఘబంధాల లీడర్లకు పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వీఓఏలు కల్పన, వెంకట రమణమ్మ, అమరావతి, శ్రీనివాసులు పాల్గొన్నారు.